క్లుప్తంగా

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి



సూపర్‌వైజర్లతో సమీక్షిస్తున్న పీడీ విమలరాణి

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ జిల్లా పీడీ టి.విమలరాణి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం ఆమె తనిఖీలు చేశారు. ఈసందర్భంగా రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ, అవగాహన సమావేశాలు ఏర్పాటు, మోనటరింగ్ విధానంపై ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రాలను రోజూ విజిట్‌చేయాలని సూచించారు.కేంద్రాల పనితీరు మెరుగుపడాలని, మాతాశిశుమరణాల రేటును పూర్తిగా నివారించాలని అన్నారు. కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి వనరుల పరిశీలన



హ్యాండ్ బోరు నుంచి తాగునీటి శాంపిల్స్ సేకరిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని వి.ఆర్.అగ్రహారంలో తాగునీటి హ్యాండ్ బోర్లు, బావులను ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. హ్యాండ్ బోర్ల నుంచి తాగునీటి శాంపిల్స్ సేకరించారు. తాగునీటి వనరుల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని,తరచూ క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అలాగే మారేడుబాక, బొద్దాం ,పెనుబాక గ్రామాల్లో పర్యటించి స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు తిరుపతిరావు, వాగ్దేవి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ దివ్య,తదితరులు ఉన్నారు.


పరామర్శ



రామకృష్ణంనాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్,తదితరులు

రేగిడి: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణంనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం రామకృష్ణంనాయుడు నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు నెల్లి పెంటంనాయుడు, మామిడి జగన్నాథంనాయుడు, సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, ఎంపీటీసీ కింజరాపు సురేష్, కెల్ల మన్మథరావు తదితరులు ఉన్నారు.

ప్రిన్సిపాల్ పురుషోదికి సన్మానం



ప్రిన్సిపల్ పురుషోదిని సత్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, తదితరులు

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణుల య్యారు. జిల్లాలో శతశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు,గురుకులాల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు మంగళవారం సన్మానించారు. అందులో భాగంగానే కోమటిపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పురుషోదిని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, డీఈఓ మాణిక్యం నాయుడు,ఆర్‌జేడీ తదితరులు శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.డిప్యూటీ డీఈఓ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బాడంగి: మండలంలోని గజరాయునివలస 11 కేవీ ఐ.ఎం.పల్లి రూరల్ ఫీడర్ పరిధి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ బి.రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, గ్రామాలకు 24గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4గంటలవరకు గజరాయునివలస, గొల్లాది, కామన్నవలస,లక్ష్మీపురం, ఐ.ఎం. పాలెం గ్రామాలకు, బాడంగి, డొంకినవలస, రేల్వేస్టేషన్, ముగడ న్యూకాలనీ,మల్లంపేటకు విద్యుత్ ఉండదని స్పష్టం చేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మోసగాళ్లకే మోసగాడు చంద్రబాబు



'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

- అన్ని వర్గాలనూ కూటమి ప్రభుత్వం మోసం చేసింది
- ఏడాది గడిచినా అమలు కాని ఎన్నికల హామీలు
- కూటమి వైఫల్యాలు, మోసాలను ఇంటింటికీ తీసుకు వెళతాం
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంలో రాజాం నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రాజేష్

సంతకవిటి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మోసగాళ్లకే మోసగాడు అని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు.'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల అధ్య క్షుడు గురుగబెల్లి స్వామినాయుడు అధ్యక్షతన రామారాయపురంలో ఆపార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం మంగళ వారం నిర్వహించారు. అతిథిగా హాజరైన రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్‌సిక్స్‌తో పా టు వందల హామీలు ఇచ్చారని, గద్దెనెక్కి ఏడాది గడిచిపోయిందని, వాటిలో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఏ పార్టీ అయినా తాము అధికారంలోకి వస్తే ఏం చేయ బోతున్నామో తెలిపేదే మేనిఫెస్టో అని అటువంటి మేనిఫెస్టోలో దాదాపు 99 శాతం అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదని, హామీలకు ఎగనామం పెట్టే ఘనత చంద్రబాబుదని అన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని హామి ఇచ్చారని, నేడు మంత్రి అచ్చెన్నాయుడు ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని అనడం విడ్డూరంగా ఉందని, ఇది కాదా మోసం అని విమర్శించారు. నిరుద్యోగ భృతి అమలు కాలేదని, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక సిలిండరే ఇచ్చారని, మూడు సిలిండర్ల పవర్ ఒకే దానిలో పెట్టారేమో అని ఎద్దేవా చేశారు.

మోసం చేయడం బాబు నైజం

మోసం చేయడం బాబు నైజమని జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ నేటికీ పెట్టుబడి సాయం అందించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. సమావేశం అనంతరం రామారాయపురం పంచాయతీ షాలీపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు.రామారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు కనకల సన్యాసినాయుడు, పార్టీ నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుడు రాగోలు రమేష్ నాయుడు, పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోనెల ప్రసాదరావు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణి అబద్ధాలు మానుకోవాలి



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

మెంటాడ: రాష్ట్ర గిరిజన శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రజలకు అబద్ధాలు, అసత్యాలు చెప్పడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ సాలూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి, ఆ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అచ్యుత్ అన్నారు. మండలంలోని ఉద్దంగి, కూనేరు ,కొండలింగాలవలస గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు సంతోష్,బుజ్జి, శిరిపురపు నాగమణి ఆధ్వ ర్యంలో మంగళవారం 'బాబు షూరిటీ -మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా నాగమణి, అచ్యుత్ మాట్లాడుతూ ఇటీవల కొండాలింగాలవల స, జయతి గ్రామాల్లో మంత్రి సంధ్యారాణి పర్యటించారని, ఆయా గ్రామాలకు తారురోడ్లు, సీసీ రోడ్లను గత టీడీపీ ప్రభుత్వంలో వేయించామని, పేదలకు ఇళ్లు కట్టించామని శుద్ధ అబద్ధాలు చెప్పడంపై విస్మయం వ్యక్తం చేశారు.ఆయా గ్రామాలకు తారు రోడ్లు, వాటర్ ట్యాంక్, ఇళ్ల నిర్మాణాలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ కృషితో జరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ గ్రామాలకు సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు నిర్మించామని గుర్తు చేశారు. ఎస్టీ గదబకి 70 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయపల్లి రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బాయి అప్పారావు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, రత్నకరనాయుడు,రామకృష్ణ పాల్గొన్నారు.

గృహహింస కేసు నమోదు

సంతకవిటి: జానకీపురం గ్రామానికి చెందిన గుణుపూరు గౌరి ఇచ్చిన ఫిర్యాధు మేరకు ఆమె భర్త గంగులు, అత్త, మామలపై గృహహింస కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు మంగళవారం తెలిపారు. తాపీ పని చేస్తూ జీవనం సాగించే గంగులు రోజూ మద్యం తాగి వచ్చి తనని హింసిస్తున్నాడని, ఈనెల 14వ తేదీన రాత్రి మద్యం తాగివచ్చి 15వ తేదీ ఉదయం నాలుగు గంటల సమయంలో తలపై కొట్టాడని గౌరి ఫిర్యాదులో పేర్కొంది. అత్త, మామలతో కలిసి తనను హింసిస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోస్టల్ ఆధ్వర్యంలో ఐటీ 2.0 సేవలు ప్రారంభం



ఐటీ 2.0 సేవలను ప్రారంభిస్తున్న పోస్టల్ అధికారులు

బొబ్బిలి: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో కొత్త ఆన్‌లైన్‌సేవలు అందించే శాఖాపరమైన నెట్‌వర్క్ ఐటీ–2.0ను స్థానిక సబ్‌పోస్ట్ ఆఫీసులోమంగళవారం ప్రారంభించారు. అత్యవసరమైన 24 గంటల ఆన్‌లైన్ లావాదేవీలను ఈ కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా ఖాతాదారులు పొందవచ్చని డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఇంత వరకూ ఇన్ఫోసిస్ సహాయంతో సాఫ్ట్‌వేర్‌ను నడిపించిన పోస్టల్‌శాఖ ఇప్పుడు సొంత సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నట్టు చెప్పారు. ఇంటి నుంచే రిజిస్టర్ పార్శిల్ సౌకర్యాన్ని ప్రారంభించామన్నారు. సిస్టం ఎడ్మినిస్ట్రేటర్ టి.గౌతమ్ కుమార్,సబ్‌పోస్ట్ మాస్టర్ జి.రాధ, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ స్వాతి, పోస్టల్‌సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలి: కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు పొట్నూరు శంకరరావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం అచ్యుతానందన్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వాములకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలు,ఇతర ప్రజాడిమాండ్ల సాధన కోసం చేసిన పలు కార్యక్రమాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు ప్రసాద్, లక్ష్మి, యుగంధర్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌కు మంగళం..!

రామభద్రపురం: గత ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాల వారి పిల్లలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందు కు జాతీయ విద్యా విధానంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రామభ ద్ర పురం ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్ పేరిట జూనియర్ కళాశాలగా మార్చింది. అయితే కూటమి ప్రభుత్వం ప్లస్‌టూ కళాశాలలో సరైన వసతులు కల్పించకపోవడంతో పాటు అధ్యాపకులను నియమించకపోవడంతో 2025–26 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభం కాలేదు. హైస్కూల్ ప్లస్ రోజూ మూసి ఉంటోంది. హెచ్ఎం గోపాలనాయుడు వద్ద సాక్షి ఈ విషయం ప్రస్తావించగా ఈ ఏడాది అడ్మిషన్లు లేకపోతే హైస్కూల్ ప్లస్‌ను మూసివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు.ఇంటర్ మొదటి ఏడాది పిల్లలకు టీసీలు ఇచ్చేయాలని చెప్పడంతో ఇక్కడ చదువుతున్న 18 మంది విద్యార్థులకు టీసీలు ఇచ్చేశామన్నారు. వారు వివిధ ప్రాంతాల్లోని జూనియర్ కళాశాలల్లో చేరిపోయారని తెలిపారు.



మూతపడిన రామభద్రపురం ఉన్నత పాఠశాలలోని హైస్కూల్ ప్లస్

సంక్షిప్తంగా..

చిన్నశిర్లాంలో గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో తహసీల్దార్ ఐ.కృష్ణలత ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి ఈ రెవెన్యూ గ్రామసభలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సర్పంచ్ టి.ఉమాపాపినాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలప ల్లి జగన్‌మోహనరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మెనూ, నాణ్యత పాటించాలి



మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ ఎం.వి.ప్రసాదరావు వంట నిర్వాహకులకు సూచించారు.మండలంలోని చెలికానివలస ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల హాజరు రికార్డులు, వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. ఎంఈఓ వెంట హెచ్ఎం టి.ప్రసన్నకుమారి ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేయించాలి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం సిటీ: వర్షాకాలం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేయించాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయించాలని, బోర్ల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించాలని చెప్పారు.

పేరెంట్స్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుగా రామశంకర్, ఆదిత్య

బొబ్బిలి :పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ బొబ్బిలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పొట్నూరు రామశంకరరావు, బలగ ఆదిత్యకుమార్‌లను రాష్ట్ర కమిటీ నియమించింది. ఈసందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో తరచూ సమావేశమై విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, పాఠశాలల్లో సౌకర్యాల ఆవశ్యకతపై చర్చించి, పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

బొడ్డవలసలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని బొడ్డవలస గ్రామంలో రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి గొర్లె అసిరినాయుడు ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 120 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, కాచిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు. నిల్వ ఆహార పదార్థాలను తినవద్దన్నారు. నివాస పరిసరాల్లో మురుగునీరు నిలవ్వకుండా చూసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని చెప్పారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రామభద్రపురం: పత్తిపంట సాగులో పాటించాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శివ



రాజాం: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ చంద్రరావు

రామభద్రపురం: సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఏ పంటలో అయినా అధిక దిగుబడులు సాధించవచ్చని మం డల వ్యవసా యాధికారి (ఏఓ) ఎం.శివ అన్నారు.దుప్పలపూడిలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.రైతులకు వివిధ రకాల ఆరుతడి పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగు నివా రణకు పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు.అలాగే అన్నదాత సుఖీభవ పథకం కోసం దరఖాస్తు చేసిన రైతుల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. అర్హత ఉండి,ఆధార్ ఎన్‌పీసీఐ లింక్ కాని రైతులు బ్యాంకు వద్దకు వెళ్లి లింక్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో వీఏఏలు పి.వెంకటరమణ,కె.దీపిక పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

రాజాం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ అందిస్తున్న పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజాం వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.చంద్రరావు రైతులకు సూచించారు. మండలంలోని దోసరి రామినాయుడువలస గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటలసాగులో మెలకువలను, తక్కువ పెట్టుబడితో అధిక దిగు బడులు సాధించే విధానాలను, సేంద్రియ ఎరువుల వినియోగం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ. 160 ప్రీమియం ఈనెలాఖరులోగా చెల్లించాలని, వరి పంటకు రూ. 200 ఆగస్టు 15వ తేదీలోగా ప్రీమియం మొత్తాన్ని రైతు సేవా కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు. ఏఓ చీకటి రఘునాథ్, వీఏఏ బి.సాయి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



బొబ్బిలిరూరల్: కోమటిపల్లి వెల్‌నెస్ సెంటర్‌లో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రవికుమార్



వంగర: మగ్గూరులో చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో రఘునాథాచారి

బొబ్బిలిరూరల్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, గ్రామాల్లో పనిచేస్తున్న వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీ డీఓ పి.రవికుమార్ ఆదేశించారు. మండలంలోని కోమటిపల్లి, కలువరాయి తదితర గ్రామాల సచివా లయాలు, వెల్‌నెస్ సెంటర్లలో మంగళవారం ఆయన తని ఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం వెల్‌నెస్ సెంటర్ల లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది దీర్ఘకాలిక సెలవులను రద్దు చేసుకోవాలని చెప్పారు.అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అంతా అందుబాటులో ఉండాలని, వెల్‌నెస్ సెంటర్లలో పూర్తిస్థాయిలో మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రజలు జ్వరాలు, ఇతర వ్యాధుల బారినపడినప్పుడు ప్రాథమిక చికిత్స అందించి, ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేయాలని సూచించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వంగర: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ ఎస్.రఘునాథా చారి ఆదేశించారు. మండలంలోని మగ్గూరులో మంగళవారం ఆయన పర్యటించారు. ఇంటింట చెత్త సేకరణను పరిశీలించి గ్రీన్ అంబాసిడర్‌కు పలు సూచనలు చేశారు. ఇంటి వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు తడి,పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని, ఆరు బయట, కాలువల్లో చెత్త పారబోయవద్దని, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

రాజాం సిటీ: జనవిజ్ఞానవేదిక(జేవీవీ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నీలయ్య పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను రాజాంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 13, 14వ తేదీల్లో జిల్లా కేంద్రం విజయనగరంలో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని తెలిపా రు. అలాగే ఈ నెల 27న డివిజన్ స్థాయి సమావేశం రాజాంలో జరగనుందని చెప్పారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. రెడ్‌క్రాస్ రాజాం చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, మక్క అప్పలనాయుడు, యూటీఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు, జేవీవీ డివిజన్ నాయకులు గొర్లె రమేష్, శాసపు సత్యనారాయణ, పందూరు వేణుగోపాలరావు, అర్నిపల్లి వెంకటనాయుడు, పెంకి గౌరీశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, బి.శ్రీనివాస్, నంది అవార్డు గ్రహీత గోకవలస కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సూచనలు, సలహాలు పాటించాలి



సరసనాపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేగిడి: పంటల సాగులో వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలను పాటించాలని రైతులకు మండల వ్యవసాయాధికారి(ఏఓ) బి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ఉణుకూరు, సరసనాపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కజొన్న సాగులో తెగుళ్ల నివారణ, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగించుకోవాలని, పంటలకు బీమా చేయించుకోవాలని చెప్పారు. ఏఈఓ ఎస్.విజయలక్ష్మి, వీఏఏ బి.గాయత్రి, సీహెచ్.జయప్రకాష్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణఆరోగ్యం



యోగా గురువును సత్కరిస్తున్న సారధి గ్రామస్తులు

రాజాం సిటీ: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా గురువు టి.టి.వి. రమణమూర్తి అన్నారు. సారధి గ్రామంలో గత పది రోజులుగా నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా యోగా చేయాలని అన్నారు. అనంతరం యోగా గురువును గ్రామస్తులు సత్కరించారు. టి.కన్నంనాయుడు, డి.గోపాలం, ఎం.మధన్, వి.వంశీకృష్ణ, ఎం.పెంటన్నాయుడు, పి.గౌరునాయుడు, టి.సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9951602843
Office mail : vzmadvt@gmail.com